భారత్ సమాచార్.నెట్
BHARATH SAMACHAR DIGITAL

10, నవంబర్ 2026, మంగళవారం భారత్ సమాచార్

దోషులను వెంటనే అరెస్టు చేయాలి: రాజిరెడ్డి



భారత్ సమాచార్, మెదక్ జిల్లా: నర్సాపూర్ పట్టణంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో స్వామివారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనను BJP ఎండోమెంట్ సెల్ మెదక్ జిల్లా జాయింట్ కన్వీనర్, హనుమాన్ సేన రాజిరెడ్డి తీవ్రంగా ఖండించారు. దేవాలయాన్ని సందర్శించి ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ఆలయంలో విగ్రహం ధ్వంసం కావడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు పాల్పడిన దుండగులను వెంటనే గుర్తించి అరెస్టు చేయాలని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం మారిన తర్వాత రాష్ట్రంలో దేవాలయాలపై దాడులు పెరిగాయని ఆరోపించారు. దేవాలయాలు, ఆధ్యాత్మిక ప్రదేశాల రక్షణ విషయంలో ప్రభుత్వం మరింత బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసే ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిని ఉపేక్షించకూడదని, నిందితులను గుర్తించి చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని కోరారు.



విశ్వకర్మలకు న్యాయం జరిగే వరకు వారికి అండగా నిలుస్తానని రాజిరెడ్డి స్పష్టం చేశారు. సామాజిక అంశాల్లో న్యాయం కోసం జరిగే పోరాటానికి తన మద్దతు ఉంటుందని తెలిపారు. దేవాలయాలపై దాడులు ఏ ప్రాంతంలో జరిగినా కులాలకు, పార్టీలకు అతీతంగా ప్రతి హిందువు స్పందించాలని పిలుపునిచ్చారు. ఆలయాల పరిరక్షణ కోసం అందరూ ఐక్యంగా నిలబడి ఇలాంటి ఘటనలను ఖండించాలని కోరారు.

నర్సాపూర్‌లోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో జరిగిన విగ్రహ ధ్వంసం ఘటనపై అధికారులు వెంటనే స్పందించి బాధ్యులను గుర్తించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని రాజిరెడ్డి డిమాండ్ చేశారు.

© 2026 Bharath Samachar